సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా
సోమవారం । 6 । మార్చి । 2023



'స్పందన' ఉండదు

కలెక్టరేట్‌లో సోమవారం జరగాల్సిన స్పందన కార్యక్రమాన్ని ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో రద్దు చేసినట్లు కలెక్టర్ బసంత్‌కుమార్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు.



టమాట కిలో రూ.20

కక్కలపల్లి మండీలో ఆదివారం కిలో టమాట ధర గరిష్టంగా రూ.20, కనిష్టం రూ.4, సరాసరి రూ.8 పలికింది. మార్కెట్‌కు 247 టన్నులు అమ్మకానికి వచ్చాయి.

గరిష్టం/కనిష్టం
38.4°/11.5°

జిల్లాలో ఆదివారం పగలు, రాత్రి ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఉదయం పూట చాలా ప్రాంతాల్లో చలి తీవ్రత కొనసాగింది. ఆగ్నేయ దిశగా గాలులు గంటకు 6 నుంచి 8 కిలో మీటర్ల వేగంతో వీచాయి.

న్యూస్‌రీల్

ఆరోగ్య సూత్రాలు పాటించండి



ర్యాలీలో సైకిల్ తొక్కుతున్న కలెక్టర్ బసంత్‌కుమార్

పుట్టపర్తి టౌన్: ఆరోగ్య సూత్రాలు పాటించడం ద్వారా మెరుగైన జీవన శైలి అలవడుతుందని కలెక్టర్ బసంత్‌కుమార్ అన్నారు. మెరుగైన ఆరోగ్యానికి సైక్లింగ్ దోహదపడుతుందని తెలిపారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవ వారోత్సవాలను పురస్కరించుకుని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ, బ్రహ్మకుమారీల ఆధ్వర్యంలో ఆదివారం పుట్టపర్తిలో సైకిల్ ర్యాలీ నిర్వహించారు. హెల్దీ ఉమెన్ – హెల్దీ ఇండియన్ పేరుతో సాగిన ఈ ర్యాలీని కలెక్టర్ ప్రారంభించి, ఎనుములపల్లి వినాయక కూడలి నుంచి సత్యమ్మ కూడలి వరకూ సైకిల్ తొక్కారు. కలెక్టర్ మాట్లాడుతూ... మెరుగైన ఆరోగ్యానికి వ్యాయమం ఎంతో అవసరమన్నారు. నడక, సైక్లింగ్ లాంటివి ప్రతి ఒక్కరూ అలవర్చుకోవాలని సూచించారు. నార్వే, స్వీడన్ డెన్మార్క్ దేశాల్లో నేటికీ పాఠశాలలకు, కార్యాలయాలకు తప్పనిసరిగా నడక లేదా సైకిల్‌పై వెళుతుంటారని గుర్తు చేశారు. ముఖ్యంగా ఆడపిల్లలకు సైక్లింగ్ మంచి వ్యాయామమన్నారు. మహిళలు ఆరోగ్యంగా ఉన్నప్పుడే ఆ కుటుంబం సంతోషంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌ఓ డాక్టర్ కృష్ణారెడ్డి, జిల్లా మలేరియా అధికారి కుళ్లాయప్ప, సీహెచ్‌ఓ నగేష్, సూపర్‌వైజర్‌లు రామ్మోహన్, తదితరులు పాల్గొన్నారు.

డీటీ శ్రీనివాస్ రావుకు తప్పిన ప్రమాదం



ప్రమాదంలో దెబ్బతిన్న కారు

పెనుకొండ రూరల్: అనంతపురం జిల్లా కలెక్టరేట్‌లో డిప్యూటీ తహసీల్దార్‌గా విధులు నిర్వహిస్తున్న శ్రీనివాస్ రావుకు ఘోర ప్రమాదం తప్పింది. ఆదివారం ఆయన ప్రయాణిస్తున్న కారు మండల పరిధిలోని పుట్టపర్తి మలుపు సమీపంలో అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొన్న అనంతరం మరో కారును ఢీకొంది. ఘటనలో శ్రీనివాస్ రావుకు ఎలాంటి గాయాలు కాలేదు. అయితే, ఆయన కారు ముందుభాగం మాత్రం పాక్షికంగా దెబ్బతింది.

జువైనల్ హోంకు ముగ్గురు

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: ద్విచక్ర వాహనాలు అపహరించుకెళుతున్న ముగ్గురు మైనర్లను పోలీసులు అదుపులోకి తీసుకుని న్యాయమూర్తి ఆదేశాల మేరకు జువైనల్ హోంకు తరలించారు. వివరాలను అనంతపురం నాల్గో పట్టణ పోలీసులు ఆదివారం ఓ ప్రకటనలో వెల్లడించారు. ముగ్గురు మైనర్ల నుంచి రూ.15 లక్షల విలువైన 16 ద్విచక్ర వాహనాలతో పాటు ఓ ఆటోని స్వాధీనం చేసుకున్నారు. వీటిలో 13 వాహనాలను అనంతపురంలోని వివిధ పోలీసు స్టేషన్ల పరిధిలో, మరో వాహనాన్ని పామిడిలో, నందికొట్కూరులో రెండు, కర్నూలులో ఆటోను అపహరించినట్లుగా విచారణలో గుర్తించారు. నిందితులపై కేసు నమోదు చేసి, న్యాయమూర్తి ఆదేశాల మేరకు బాలల పరివర్తన కేంద్రానికి తరలించారు.

అప్పుడే అసమ్మతి గళం!

> వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలతో రాష్ట్రంలో సైకిల్ జాడ కనుమరుగైపోతోంది. జిల్లాలో అయితే ఆ విషయం స్పష్టంగా కనిపిస్తోంది. పేరుకే పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లైనా అసలు టికెట్ వస్తుందో లేదో అనే విషయంపై క్లారిటీ లేక బడానేతలకు దిక్కుతోచడం లేదు. ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారానికీ చాప చుట్టేసిన నేపథ్యంలో టీడీపీ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ 'యువగళం' పేరుతో జిల్లాలోకి వస్తుండడం వారిలో గుబులు రేపుతోంది. తమకు తెలీకుండా కిందిస్థాయి నాయకులు ఆయనను ఇప్పటికే కలవడం మరింత కలవరపెడుతోంది.



- లోకేష్ పాదయాత్రపై జిల్లా టీడీపీ నేతల గుర్రు
- లోకల్ నాయకులు ముందుగానే భేటీ అవుతుండడంపై గరంగరం
- ఎవరికి వారు సొంత ప్రొఫైల్స్‌తో వెళ్తున్నట్లు సమాచారం
- జిల్లాలోకి ప్రవేశించకనే అగ్గిరాజేస్తున్న నారా వారి తనయుడు

సాక్షి, పుట్టపర్తి: ప్రజలకు దగ్గరవడం సంగతేమో కానీ, జిల్లా టీడీపీ నేతల నడుమ మరింత అగ్గి రాజేసేందుకే టీడీపీ నేత నారా లోకేష్ వస్తున్నట్లు కనిపిస్తోంది. ఎవరికి వారు వేరు కుంపట్లు పెట్టుకోవడంతో ఇప్పటికే 'తమ్ముళ్లు' పార్టీకి దూరమైన పరిస్థితి. ఈ సమయంలోనే 'యువగళం' పేరుతో పాదయాత్రగా వస్తుండడంతో టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లకు కొత్త సమస్య తలెత్తినట్లు తెలిసింది. తమకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా నేరుగా లోకేశ్‌తో సెకండ్ క్యాడర్ నాయకులు సమావేశం అవుతుండడంతో ప్రొటోకాల్ వివాదం తారస్థాయికి చేరినట్లు సమాచారం. ఎమ్మెల్యే, ఎంపీ టికెట్ ఆశిస్తున్న వారు గుట్టు చప్పుడు కాకుండా భేటీ అవుతున్న విషయం ఆ పార్టీలో చర్చకు దారి తీసినట్లు విశ్వసనీయంగా తెలిసింది.

ఎవరికి వారు సొంత డబ్బా

ప్రస్తుతం పక్కనే ఉన్న అన్నమయ్య జిల్లాలో 'యువగళం' కొనసాగుతోంది. దీంతో లోకేశ్‌తో భేటీ అయ్యేందుకు శ్రీ సత్యసాయి జిల్లాకు చెందిన టీడీపీ నేతలు వెళుతున్నారు. నియోజకవర్గాల ఇన్‌చార్జ్‌లకు సమాచారం ఇవ్వకుండా నేరుగా సమావేశమవుతున్నారు. నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్‌లకు వ్యతిరేకంగా ఉన్న కొందరు తమ్ముళ్లు కలుస్తుండడంతో 'ప్రొటోకాల్' వివాదం ముదిరింది. ఎవరికి వారు కొత్త కొత్త ప్రొఫైల్స్ సిద్ధం చేసుకుని ప్రధాన కార్యదర్శి ముందుంచుతున్నట్లు సమాచారం.

ముందుముందు ఎలా ఉంటుందో..?

లోకేశ్ నిర్వహిస్తోన్న 'యువగళం' ఈనెల 17న జిల్లాలోకి ప్రవేశించనుంది. అన్నమయ్య జిల్లాలో నుంచి తనకల్లు మండలంలోకి ముందుగా ప్రవేశిస్తారు. అక్కడి నుంచి కదిరి, పుట్టపర్తి, పెనుకొండ, రాప్తాడు, ధర్మవరం నియోజకవర్గాల మీదుగా అనంతపురం జిల్లాలోకి ఎంట్రీ ఇస్తారని టీడీపీ శ్రేణుల ద్వారా తెలిసింది. చంద్రబాబు తనయుడు జిల్లాలోకి ఎంట్రీ కాక ముందే బడా నేతలు – సెకండ్ క్యాడర్ మధ్య సమన్వయం పూర్తిగా దెబ్బతినడం, తమ్ముళ్ల మధ్య రగడ ప్రారంభమైన నేపథ్యంలో లోకేశ్ ఆయా నియోజకవర్గాలకు వచ్చే నాటికి ఎలాంటి వ్యతిరేక పవనాలు వీస్తాయనేది రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారింది.

లోకేశ్‌తో విడివిడిగా కలిసిన కొందరి వివరాలిలా..

- పుట్టపర్తి నియోజకవర్గం నుంచి సామకోటి ఆదినారాయణ నారా లోకేశ్‌ను కలిసి వచ్చారు. దీనిపై నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ పల్లె రఘునాథరెడ్డికి ఎలాంటి సమాచారం ఇవ్వలేదని తెలిసింది.
- పెనుకొండ నియోజకవర్గం నుంచి సవితమ్మ, పార్థసారథి వేర్వేరుగా నారా లోకేశ్‌తో భేటీ అయ్యారు. ఇద్దరూ టికెట్ రేసులో ఉండటంతో ఈ విషయం చర్చకు దారి తీసింది.
- కదిరి నియోజకవర్గం నుంచి కందికుంట వెంకట ప్రసాద్ వర్గం, అత్తార్ చాంద్‌బాషా వర్గం సభ్యులు వేర్వేరుగా భేటీ అయ్యారు.
- ధర్మవరం నియోజకవర్గం నుంచి పరిటాల శ్రీరామ్ వర్గంలో కొందరు.. వ్యతిరేక వర్గం నుంచి ఇంకొందరు లోకేశ్‌తో సమావేశం అయినట్లు తెలిసింది.
- మడకశిర, హిందూపురం నియోజకవర్గాల నుంచి కూడా సెకండ్ క్యాడర్ నేతలు కొందరు ఇన్‌చార్జ్‌కు తెలియకుండా లోకేశ్‌ను కలిసినట్లు తమ్ముళ్లు గుసగుసలాడుతున్నారు.
- బడా, చోటా నేతలతో పాటు సెకండ్ క్యాడర్, మండల స్థాయి నాయకులు నారావారి తనయుడితో సమావేశం అవుతుండటం ఇన్‌చార్జ్‌లకు మింగుడు పడటం లేదు.

సబ్ జూనియర్ హాకీ టోర్నీలో జిల్లా బాలికల సత్తా



తృతీయ స్థానంలో నిలిచిన శ్రీసత్యసాయి జిల్లా జట్టు

అనంతపురం సప్తగిరి సర్కిల్: అనంత క్రీడాగ్రామం వేదికగా సాగిన సబ్ జూనియర్ బాలికల హాకీ టోర్నీలో జిల్లా బాలికల జట్టు సత్తా చాటింది. తృతీయ స్థానంలో నిలిచి బాలికలు శభాష్ అనిపించుకున్నారు. వైఎస్సార్ జిల్లా జట్టు విన్నర్‌గా నిలవగా, రన్నరప్‌ను అనంతపురం జిల్లా జట్టు దక్కించుకుంది. తృతీయస్థానం కోసం ఆదివారం జరిగిన పోటీలో శ్రీకాకుళం, శ్రీసత్యసాయి జిల్లా జట్లు తలపడ్డాయి. 4–1 గోల్స్ తేడాతో శ్రీసత్యసాయి జిల్లా జట్టు గెలుపొందింది. జట్టులో మధురిమబాయి 2, నవ్యశ్రీ, సింధు చెరో గోల్, శ్రీకాకుళం జట్టులో తులసి ఒక గోల్ సాధించారు. ఈ సందర్భంగా విజేతలను అభినందిస్తూ ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సప్తగిరి క్యాంఫర్ ఎండీ మహమ్మద్ హనీఫ్, రవికాంత్ రమణ హాజరయ్యారు. విజేతలకు ట్రోఫీలను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. క్రీడాకారులకు ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహాన్ని అందిపుచ్చుకుని ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో రాష్ట్ర హాకీ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు సూర్యప్రకాష్, అనంతపురం జిల్లా కన్వీనర్ అనిల్‌రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సమ్మిట్‌తో ఉత్సాహం

- ఉమ్మడి జిల్లాలో పెట్టుబడులకు ఊతం
- కొత్త పారిశ్రామిక పాలసీ కోసం ఎదురుచూపు
- సింగిల్ డెస్క్ పాలసీతో ఇన్వెస్టర్లకు వెసులుబాటు
- భూముల కేటాయింపు అత్యంత పారదర్శకం

సాక్షి ప్రతినిధి, అనంతపురం:

విశాఖపట్నంలో నిర్వహించిన గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్ విజయవంతం కావడంతో పారిశ్రామికవేత్తల్లో నూతనోత్సాహం కన్పిస్తోంది. ఇదే ఉత్సాహంతో ఉమ్మడి అనంతపురం జిల్లాలో పెద్దఎత్తున పరిశ్రమలు స్థాపించే అవకాశాలు ఉన్నాయి. వచ్చే ఆర్థిక సంవత్సరం (ఏప్రిల్ 1 నుంచి)లో కొత్త పారిశ్రామిక పాలసీ వచ్చే అవకాశం ఉంది. దాని కోసం ఆత్రుతగా ఎదురు చూస్తున్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక పారిశ్రామిక అనుమతులకు సంబంధించి సింగిల్ డెస్క్ పాలసీ అమలు చేస్తున్నారు. దీనివల్ల భారీగా పెట్టుబడులు వస్తున్నాయి. కర్ణాటకకు చెందిన వారు కూడా ఇక్కడికి వచ్చి పెట్టుబడులు పెడుతున్నారు. ఇలాంటి తరుణంలో కొత్త పారిశ్రామిక పాలసీలో మరిన్ని రాయితీలేమైనా వస్తే పరిశ్రమల స్థాపన ఊపందుకునే అవకాశం ఉంది. సింగిల్ డెస్క్ పాలసీ అంటే ఒక్కసారి దరఖాస్తు చేసుకుంటే ఎక్కడికీ వెళ్లకుండానే అధికారులే అన్ని రకాలుగా సహకారం అందించడం అన్నమాట. ఈ పరిస్థితి ఉండటంతోనే ఎక్కువ మంది ఆకర్షితులవుతున్నారు.



భారీగా పెట్టుబడులు..

జగన్ సర్కారు వచ్చాక ఉమ్మడి జిల్లాలో భారీగా సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలు (ఎంఎస్‌ఎంఈ) ఏర్పాటయ్యాయి. ఒక్క శ్రీసత్యసాయి జిల్లాలోనే 1,532 ఎంఎస్‌ఎంఈ యూనిట్లు నెలకొల్పారు. 22 భారీ తరహా ప్రాజెక్టులూ వచ్చాయి. ప్రధానంగా భూముల కేటాయింపులో అత్యంత పారదర్శకంగా ఉంటుండడంతో పారిశ్రామిక వేత్తలు ఆకర్షితులవుతున్నారు. ఇప్పటికే ఏపీఐఐసీ సేకరించిన భూములను పరిశ్రమలకు కేటాయిస్తున్నారు. పారిశ్రామిక విభాగం పోర్టల్‌లో దరఖాస్తు చేసుకుంటే చాలు అన్నీ దగ్గరుండి అధికారులే చూసుకుంటున్నారు. ఇన్ని సానుకూలతలు ఉన్నందున వచ్చే ఆర్థిక సంవత్సరంలో ఉమ్మడి అనంతపురం జిల్లాలో మరిన్ని పరిశ్రమలు స్థాపించే అవకాశం ఉందని నిపుణులు భావిస్తున్నారు.

ఈ ప్రభుత్వం వచ్చాక జిల్లాలో స్థాపించిన పరిశ్రమలు

భారీ పరిశ్రమలు	22
పెట్టుబడులు	రూ.14,790 కోట్లు
ఉద్యోగాలు	12,785
ఎంఎస్‌ఎంఈలు	1,532
పెట్టుబడులు	రూ.674 కోట్లు
ఉద్యోగాలు	11,312

పెట్టుబడులకు స్వర్గధామం

పెట్టుబడులకు ఆంధ్రప్రదేశ్ స్వర్గధామం లాంటిది. అందులోనూ అనంతపురం, శ్రీసత్యసాయి లాంటి జిల్లాల్లో పెట్టుబడి పెట్టే పారిశ్రామిక వేత్తలకు మరింత సానుకూలంగా ఉంది. రోడ్డు కనెక్టివిటీతో పాటు అంతర్జాతీయ విమానాశ్రయం దగ్గరుండటం మంచి పరిణామం. గ్లోబల్ ఇన్వెస్ట్‌మెంట్ సమ్మిట్ వంటివి పారిశ్రామిక వేత్తలకు మంచి భరోసా ఇస్తాయి.
– మెట్టు గోవిందరెడ్డి, ఏపీఐఐసీ ఛైర్మన్

త్వరలోనే కొత్తపాలసీ

రాష్ట్రంలో పరిశ్రమల స్థాపన, పెట్టుబడులు వంటి వాటి విషయంలో కొత్త పాలసీ వచ్చే అవకాశం ఉంది. బహుశా ఏప్రిల్ 1 నుంచి రావచ్చు. కొత్తపాలసీ వస్తే మరింతగా పెట్టుబడులు పెట్టడానికి పారిశ్రామికవేత్తలు ముందుకు వస్తారు. జిల్లా తరఫున గ్లోబల్ ఇన్వెస్ట్‌మెంట్ సమ్మిట్‌లో పాల్గొనడం మాకు మంచి అవకాశం.
– నాగరాజారావు, జనరల్ మేనేజర్, పరిశ్రమల శాఖ

పగలు భగభగ...రాత్రి గజగజ

- ఉదయం 10 నుంచే మండిపోతున్న ఎండలు
- రాత్రి వేళ చలిగాలులు
- ఎల్‌నినో ప్రభావం అంటున్న శాస్త్రవేత్తలు



ఆదివారం మధ్యాహ్న సమయంలో బోసిపోయిన హిందూపురం ప్రధాన రహదారి

హిందూపురం: వాతావరణంలో భిన్న మార్పులు చోటుచేసుకుంటున్నాయి. భానుడు ప్రభావం చూపుతున్నా మరో పక్క రాత్రి, ఉదయం పూట చలి కూడా కనిపిస్తోంది. పగలంతా ఎండలు దంచికొడుతుండగా రాత్రి చలి గజగజ వణిస్తోంది. పగటి ఉష్ణోగ్రతలు సాధారణం కన్నా 2 నుంచి 4 డిగ్రీలు అధికంగా నమోదవుతున్నాయి. మామూలుగా ఈ సమయంలో 32 నుంచి 33 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు నమోదు కావాల్సి ఉండగా ప్రస్తుతం 36 నుంచి 38 వరకు నమోదవుతుండడం గమనార్హం. రాత్రి, తెల్లవారు జామున సాధారణం కంటే 2 నుంచి 4 శాతానికి ఉష్ణోగ్రతలు పడిపోతున్నాయి. ఈ సమయంలో సాధారణంగా 18 – 20 శాతం ఉష్ణోగ్రతలు ఉంటాయి. వారం రోజులుగా పరిశీలిస్తే 12 నుంచి 9 శాతానికి పడిపోయాయి. హిందూపురం, మడకశిర, చిలమత్తూరు, గోరంట్ల ప్రాంతాల్లో రాత్రిపూట 10 –12 శాతం మేర ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి.


ఎల్‌నినో ప్రభావంతో..

గత ఫిబ్రవరి చివరి వారం నుంచి మార్చి మొదటి వారంలో పగటి ఉష్ణోగ్రత 37 శాతం నమోదు అవుతుండగా కనిష్ట ఉష్ణోగ్రత కూడా అదేరీతిలో తగ్గుతోంది. పసిఫిక్ మహాసముద్రంలో భూమధ్యరేఖ చుట్టుపక్క ఉపరితలంలో ఉష్ణోగ్రత విపరీతంగా పెరగడంతో మార్చి ప్రారంభంలోనే సాధారణ ఉష్ణోగ్రత పెరుగుతూ ఉంది. దిగువ ట్రోపో ఆవరణంలో ఈశాన్య తూర్పు దిశలో గాలులు వీస్తుండడంతో ఇలా జరుగుతోందని వాతావరణ శాస్త్రవేత్తలు చెబుతున్నారు. ఏప్రిల్, మే మాసాల్లో ఎండలు మండే పరిస్థితి ఉండవచ్చని అభిప్రాయపడుతున్నారు.

తేదీ	గరిష్ట ఉష్ణోగ్రత	కనిష్ట ఉష్ణోగ్రత
26-03-23	37.6	10.9
27-02-23	37.9	12.7
28-02-23	37.8	10.6
01-03-23	37.6	9.6
02-03-23	38.3	12.4
03-03-23	37.6	12.2
04-03-23	36.9	13.6
05-03-23	35.3	16.6

'ప్రైవేట్'లో 25 శాతం సీట్లు!

సమాజంలోని 6 నుంచి 14 ఏళ్లలోపు పిల్లలంతా చదువుకోవాలనే ఉద్దేశంతో 2009 ఆగస్టు 27న కేంద్ర ప్రభుత్వం 'ఉచిత నిర్బంధ విద్య బాలల హక్కు చట్టం'ను రూపొందించింది. ఈ చట్టం ప్రకారం ప్రభుత్వ గుర్తింపు ఉన్న ప్రైవేట్ పాఠశాలల్లో 25 శాతం సీట్లను పేద పిల్లలకు ఒకటో తరగతిలో అడ్మిషన్లు ఇవ్వాల్సి ఉంది. వీరి ఫీజు మొత్తాన్ని ప్రభుత్వమే భరిస్తుంది. ఎంతో ఉన్నతమైన ఈ చట్టం పూర్తి స్థాయిలో అమలు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది.



- పేదింటి పిల్లలకు సువర్ణావకాశం
- నేటి నుంచి 16 వరకు వెబ్‌సైట్‌లో ప్రైవేట్ స్కూళ్ల రిజిస్ట్రేషన్
- 18 నుంచి ఏప్రిల్ 7 వరకు ఆన్‌లైన్‌లో విద్యార్థుల దరఖాస్తు

రాప్తాడురూరల్: విద్యాహక్కు చట్టం –2009 కింద ప్రైవేట్ విద్యాసంస్థల్లో 2023–24 విద్యా సంవత్సరం ప్రారంభం నాటికి పేద పిల్లలకు 25 శాతం కోటా అడ్మిషన్ల అమలు పటిష్టంగా చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఉమ్మడి జిల్లాలో 811 ప్రైవేట్ స్కూళ్లు ఉన్నాయి. ఇందులో అనంతపురం జిల్లాలో 245 ప్రాథమిక, 210 ప్రాథమికోన్నత పాఠశాలలు, శ్రీసత్యసాయి జిల్లాలో 157 ప్రాథమిక, 199 ప్రాథమికోన్నత పాఠశాలలు ఉన్నాయి. ప్రతి ప్రైవేట్ పాఠశాలలోనూ అనాథ, దివ్యాంగ పిల్లలు, హెచ్‌ఐవీ బాధితుల పిల్లలకు 5 శాతం, ఎస్సీలకు 10 శాతం, ఎస్టీలకు 4 శాతం, బలహీన వర్గాల పిల్లలకు 6 శాతం వెరసి 25 శాతం సీట్లను కేటాయించాలి. ఇందుకు తల్లిదండ్రుల వార్షిక ఆదాయం గ్రామీణ ప్రాంతాల్లో రూ.1.20 లక్షలు, పట్టణ ప్రాంతాల్లో రూ.1.44 లక్షలు ఉండాలి. అర్బన్ పరిధిలోని పాఠశాలల్లో ఒక్కో అడ్మిషన్‌కు రూ.8 వేలు, రూరల్ పరిధిలోని పాఠశాలల్లో రూ. 6500 ఫీజును ప్రభుత్వం నిర్ణయించింది. ఈ ఫీజు మొత్తాన్ని ప్రభుత్వమే ఆయా పాఠశాలలకు చెల్లిస్తుంది. అయితే మన రాష్ట్రంలో 'అమ్మ ఒడి' పథకం ద్వారా ప్రతి ఏటా ఒక్కో విద్యార్థికి రూ.15 వేలు ప్రభుత్వం అందజేస్తోంది. ప్రైవేట్ స్కూళ్లకు ఎంపికైన విద్యార్థులకు 'అమ ఒడి' డబ్బులతోనే ఫీజు చెల్లిస్తారు. తక్కిన సొమ్మును విద్యార్థి తల్లి/సంరక్షకుల ఖాతాలో జమ చేస్తారు. ఇందుకు సంబంధించిన నోటిఫికేషన్ రెండు రోజుల క్రితం విడుదలైంది.

కి.మీ పరిధిలోని పాఠశాలలకు ప్రాధాన్యత

విద్యార్థులు నివాసం ఉండే (ఆధార్‌లో చిరునామా ప్రామాణికం) ప్రాంతంలో కిలోమీటరు పరిధిలో ఉన్న పాఠశాలలకు మొదటి ప్రాధాన్యత ఇస్తారు. ఆ తర్వాత మూడు కిలోమీటర్ల పరిధిలోని పాఠశాలలకు కేటాయిస్తారు. ప్రతి ఒక్కరికీ తమకు ఫలానా స్కూలే కావాలంటే కుదరదు. వారి ఇళ్లకు సమీపంలోని పాఠశాలలకు ప్రాధాన్యత ఉంటుంది. ప్రైవేట్ పాఠశాలల అడ్మిషన్ల ప్రక్రియ పూర్తయితే ఎన్ని పాఠశాలల్లో అడ్మిషన్లు పొందే వీలుంటుందనేది స్పష్టమవుతుంది.

ఆన్‌లైన్‌లోనే రిజిస్ట్రేషన్

ఈ నెల 6 నుంచి 16 వరకు ప్రైవేట్ పాఠశాలలు వెబ్‌సైట్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. ఈనెల 18 నుంచి ఏప్రిల్ 7 వరకు అర్హులైన విద్యార్థులు తమ పేర్లను ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలి. 9 నుంచి 12 వరకు సచివాలయాల్లో ఉన్న డేటా ద్వారా అర్హులైన విద్యార్థులను గుర్తిస్తారు. 13న లాటరీ ద్వారా విద్యార్థులను ఎంపిక చేస్తారు. 15 నుంచి 21 వరకు ఆయా స్కూళ్లకు విద్యార్థుల అడ్మిషన్లను ఖరారు చేస్తారు. మిగులు సీట్లకు 25న రెండోసారి లాటరీ నిర్వహిస్తారు. 26 నుంచి 30 వరకు ఆయా స్కూళ్లలో అడ్మిషన్లు చేయిస్తారు.

ఉమ్మడి జిల్లాలో మొత్తం ప్రైవేట్ స్కూళ్లు	811
అనంతపురం జిల్లాలో..	455
శ్రీసత్యసాయి జిల్లాలో..	356

పేద పిల్లలకు మంచి అవకాశం



విద్యాహక్కు చట్టం –2009 ద్వారా పేద పిల్లలు ప్రైవేట్ పాఠశాలల్లో చదువుకోవచ్చు. ఇదో మంచి అవకాశం. ఫీజు బెంగ ఉండదు. వారి చదువును ప్రభుత్వమే భరిస్తుంది. 2023–24 విద్యా సంవత్సరంలో పూర్తిస్థాయిలో అమలు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. జిల్లాలో గుర్తింపు పొందిన అన్ని పాఠశాలలు రిజిస్ట్రేషన్లు చేసుకునేలా చూస్తాం. విద్యార్థులు వారి ఇంటి సమీపంలోని పాఠశాలలను ఎంపిక చేసుకోవచ్చు.
– సాయిరాం, జిల్లా విద్యాశాఖ అధికారి, అనంతపురం

సింహ వాహనంపై శ్రీవారి వైభవం



తిరువీధుల్లో ఊరేగుతున్న శ్రీవారు

ఖాద్రీ లక్ష్మీ నరసింహస్వామి బ్రహ్మోత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. నాల్గో రోజైన ఆదివారం స్వామి వారు సింహ వాహనంపై తిరుమాడ వీధుల్లో భక్తులకు దర్శనమిచ్చారు. మంగళవాయిద్యాలు, పండితుల వేద మంత్రాల నడుమ అర్చకులు వైదిక కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. సింహం శౌర్యానికి, గాంభీర్యానికి, పరాక్రమానికి ప్రతీక. స్వామివారికి ప్రీతి పాత్రమైన సింహ రూపంలోనే నరసింహ అవతారమెత్తి హిరణ్య కశ్యపుడిని సంహరించారు. ఎప్పటి లాగానే తమిళనాడు రాష్ట్రానికి చెందిన నాదస్వరం, డోలు విద్వాంసులు వాహనం ముందు భక్తితో పాటు తమ కళను చాటుకున్నారు. ఆలయ ప్రాంగణంలో భక్తుల కాలక్షేపం కోసం ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం హనుమంత వాహనంపై తిరువీధుల్లో స్వామివారు భక్తులకు దర్శనమిస్తారు. దుష్ట శిక్షణ, శిష్ట రక్షణ కోసం హనుమంతుని భుజాలపై కొలువు దీరిన శ్రీవారిని చూడడానికి రెండు కళ్లు సరిపోవు.
– కదిరి:

క్లుప్తంగా

గడ్డివామి దగ్ధం

బ్రహ్మసముద్రం: మండలంలోని ఎరడికెర గ్రామంలో ఆదివారం గడ్డి వాము దగ్ధమైంది. గ్రామానికి చెందిన బోయ ఈరన్న గడ్డివామి కి ప్రమాదవ శాత్తు నిప్పుపడి మంటలు ఎగసి పడ్డాయి. గమనించిన స్థానికులు వెంటనే ఫైరింజన్‌కు సమాచారం ఇచ్చారు. ఫైర్ సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. అప్పటికే గడ్డివాము, వేరుశనగ గ్రాసం కాలిబూడిదైంది. దాదాపు రూ.40 వేలు నష్టం వాటిల్లిందని బాధితుడు వాపోయాడు.

నేటి నుంచి కాటమయ్య బ్రహ్మోత్సవాలు

బత్తలపల్లి: మండలంలోని సంజీవపురం గ్రామ సమీపంలో వెలసిన కాటికోటేశ్వరంలో కాటమయ్య స్వామి బ్రహ్మోత్సవాలు సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయి. 6వ తేదీ రెడ్డివారి బోనాలు, 7న ఈదులముష్టూరు నుంచి స్వామి ఉత్సవమూర్తులను క్షేత్రానికి తరలించడం, అదే రోజు పానకం బండ్లతో కాటమయ్య కొండ చుట్టూ ప్రదక్షిణలు ఉంటాయి. 8వ తేదీ రాత్రి వేల సంఖ్యలో భక్తులు పాల్గొని బాణాసంచా కాలుస్తారు. 9వ తేదీ మూడో రోజు పగలు జాతర జరుగుతుంది. అనంతరం ముష్టూరు గ్రామంలో 10వ తేదీ రథోత్సవం నిర్వహిస్తారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని సౌకర్యాలు కల్పించినట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

'న్యాక్'కు సన్నద్ధం

- రూ. 2.31 కోట్లతో రోడ్డు నిర్మాణం
- రూ.40 లక్షల వ్యయంతో భవనాలకు మరమ్మతులు
- త్వరలో న్యాక్ పీర్ కమిటీ పర్యటన



శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం ముఖద్వారం

అనంతపురం: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం న్యాక్ (నేషనల్ అసెస్‌మెంట్ అండ్ అక్రిడిటేషన్ కౌన్సిల్) పరీక్షకు సన్నద్ధమవుతోంది. న్యాక్ గుర్తింపునకు దరఖాస్తు చేసిన నేపథ్యంలో మెరుగైన పాయింట్లను సాధించే దిశగా వర్సిటీ ఉన్నతాధికారులు కృషి చేస్తున్నారు. న్యాక్‌లో గణనీయమైన గ్రేడింగ్ వస్తే రూసా (రాష్ట్రీయ ఉచ్చతార్ శిక్షా అభియాన్) పథకం కింద నిధులు రానున్నాయి. ఏ ప్లస్, ఏ గ్రేడ్ వస్తే రూ.40 కోట్ల నిధులు మంజూరవుతాయి. ఈ క్రమంలో వర్సిటీలో పలు అభివృద్ధి పనులు చేపట్టారు.

లా కళాశాల నుంచి నూతన రోడ్డు..

ఎస్కేయూ క్యాంపస్‌లోని లా కళాశాల నుంచి విద్యుత్ కార్యాలయం, క్యాంటీన్ వరకు, పూలే భవనం నుంచి కామన్‌మెస్ హాలు వరకు రోడ్డు నిర్మాణం చేపట్టారు. ఇందు కోసం రూ.2.31 కోట్లు వెచ్చిస్తున్నారు. ఈ మొత్తాన్ని ఖర్చు చేయడానికి బిల్డింగ్ కమిటీ ఆమోదం తెలిపింది. మరో రూ.40 లక్షల నిధులతో వర్సిటీ భవనాలకు మరమ్మతుల, పెయింటింగ్ పనులు చేపట్టనున్నారు. రూ.1.20 కోట్లతో బాయ్స్, గరల్స్ హాస్టళ్లకు మరమ్మతులు చేయించనున్నారు.

ఐఎస్ఓ గుర్తింపునకు దరఖాస్తు..

ఐఎస్ఓ(ఇంటర్నేషనల్ ఆర్గనైజేషన్ ఫర్ స్టాండరైజేషన్) గుర్తింపు తీసుకువచ్చేలా ఇప్పటికే ఆ గుర్తింపు పొందిన అనుభవం ఉన్న కంపెనీల నుంచి సలహాలు, సూచనలు తీసుకుంటున్నారు. క్వాలిటీ మేనేజ్‌మెంట్, ఎన్విరాన్‌మెంటల్ మేనేజ్‌మెంట్, ఎనర్జీ మేనేజ్‌మెంట్, గ్రీన్ ఆడిట్, ఎన్విరాన్‌మెంటల్ ఆడిట్ అండ్ ఎనర్జీ ఆడిట్ విభాగాల్లో ఐఎస్ఓ గుర్తింపు దక్కించుకునేందుకు చర్యలు తీసుకున్నారు. ఐఎస్ఓ గుర్తింపు దక్కితే న్యాక్‌లో పాయింట్లు పెరగనున్నాయి.

ఎస్ఎస్ఆర్ రూపకల్పనలో నిమగ్నం..

ఎస్ఎస్ఆర్(సెల్ఫ్ స్టడీ రిపోర్ట్)లో పేర్కొన్న అంశాలను ప్రధానంగా న్యాక్ పీర్ కమిటీ పరిశీలించనుంది. ఈ నేపథ్యంలో ఎస్ఎస్ఆర్‌లో పేర్కొనే అంశాల ప్రాధాన్యత వివరాల సేకరణలో అధికారులు తలమునకలయ్యారు. 2017–18, 2018–19, 2019–20, 2020–21, 2021–22 విద్యా సంవత్సరాల్లో ఆయా విభాగాల్లో సాధించిన ప్రగతి, అధ్యాపక – విద్యార్థి నిష్పత్తి, కోర్సు పూర్తి చేసిన విద్యార్థుల వివరాలు, వారికి దక్కిన ఉద్యోగాలు, ఫీజు రీయింబర్స్‌మెంట్ వివరాలు, ఉపకార వేతనాలు, క్యాంపస్‌లో సౌకర్యాలు, హాస్టల్ – ఆస్పత్రి సదుపాయం, యాంటీ ర్యాగింగ్ కమిటీ, బొటానికల్ గార్డెన్, హరితవనం తదితర అంశాలను ఎస్ఎస్ఆర్‌లో పొందుపరుస్తున్నారు. అలాగే రూసా, టెక్విప్, డీఎస్టీ, డీబీటీ నుంచి పొందిన నిధుల వివరాలు, ప్రాజెక్ట్ వివరాలను ఉటంకిస్తూ నివేదికలు సిద్ధం చేస్తున్నారు.

మంచి గ్రేడ్ సాధనకు కృషి



న్యాక్‌లో మంచి గ్రేడ్ దక్కించుకునేందుకు కృషి చేస్తున్నాం. 2017 నుంచి 2022 వరకూ వర్సిటీ సాధించిన ప్రగతి నివేదికల రూపకల్పన ప్రక్రియ జరుగుతోంది. ఎస్ఎస్ఆర్ నివేదికను సమర్పించిన అనంతరం న్యాక్ కమిటీ పర్యటన ఉంటుంది.

– ప్రొఫెసర్ ఎంవీ లక్ష్మయ్య, రిజిస్ట్రార్, ఎస్కేయూ

రాత్రికి రాత్రే తవ్విన బావి



సాసవుల చిన్నమ్మ తవ్వించిన పాలబావి ఇదే

కదిరి: స్థానిక బెంగుళూరు రహదారిలో ముత్యాల చెరువుకు సమీపంలో ఉన్న పాలబావిని ఖాద్రీ లక్ష్మీ నరసింహస్వామి భక్తురాలు, కర్ణాటక ప్రాంతానికి చెందిన సాసవుల చిన్నమ్మ రాత్రికి రాత్రే తవ్వించినట్లు స్థల పురాణం చెబుతోంది. ఈ బావిని కొంత లోతు తవ్విన తర్వాత కింద నుంచి కోడికూతతో పాటు రోకలితో ధాన్యం దంచుతున్న శబ్దం వినబడిందట. ఈ విషయాన్ని తెలుసుకున్న చిన్నమ్మ... కింద మరో లోకం ఉందని భావించి తవ్వడం ఆపేశారట. తర్వాత వచ్చే వేసవికి ఆ బావి పొంగి ప్రవహించడం అందరినీ ఆశ్చర్యానికి గురి చేసింది. ఆ నీరు పాలను తలపించడంతో పాలబావిగా పిలవసాగారు. ఎంతటి కరువు కాటకాలొచ్చినా ఈ బావిలో నీరు స్థిరంగా ఉండడం ఈ క్షేత్ర మహాత్యానికి నిదర్శనమని భక్తులు అంటున్నారు. ఈ నీటిని నరసింహ స్వామి భక్తులు పవిత్ర తీర్థంగా భావిస్తారు. అంతేకాక ఆలయ దక్షిణ గోపురాన్ని సైతం చిన్నమ్మనే నిర్మించినట్లు చరిత్ర చెబుతోంది. పుత్రసంతానం కోసం ఈ పాలబావిలో అప్పట్లో క్షీరకేతుడనే రాజు స్నానమాచరించి ఖాద్రీశుడిని దర్శించుకోవడంతో అతని కోరిక నెరవేరిందట. అప్పటి నుంచి క్షీరకేతుడి పేరు మీద పాలబావిని క్షీరతీర్థమని కూడా పిలుస్తున్నారు.

ఆ యార్డులు అన్నింటా టాప్

- మార్కెటింగ్ ఫీజు వసూళ్లలో వంద శాతం లక్ష్యాన్ని సాధించిన శింగనమల, అనంత, రాప్తాడు
- జిల్లా వ్యాప్తంగా 86 శాతం వసూళ్లు
- లక్ష్యానికి చేరువలో తాడిపత్రి, రాయదుర్గం మార్కెట్లు
- ఆమడదూరంలో గుంతకల్లు, ఉరవకొండ, కళ్యాణదుర్గం



అనంతపురం అగ్రికల్చర్: ఈ ఏడాది మార్కెటింగ్‌శాఖ పయనం ఆశాజనకంగా ఉంటోంది. జిల్లాలోని 9 వ్యవసాయ మార్కెట్‌యార్డులు, 15 చెక్‌పోస్టుల ద్వారా గణనీయమైన ఆదాయం చేకూరుతోంది. ప్రస్తుత 2022–23 ఆర్థిక సంవత్సరంలో వివిధ రూపాల్లో రూ.10.43 కోట్ల వసూళ్ల లక్ష్యంగా నిర్దేశించుకోగా ఫిబ్రవరితో ముగిసిన 11 నెలల కాలంలో రూ.8.88 కోట్ల (86 శాతం) మేర వసూళ్లు జరిగాయి. ఈ నెలాఖరు నాటికి మిగిలిన 14 శాతం సాధించి 100 శాతం లక్ష్యాన్ని చేరుకునేందుకు మార్కెటింగ్ శాఖ అధికారులు చర్యలు తీసుకున్నారు.

లక్ష్యాన్ని అధిగమించిన మూడు కమిటీలు..

అనంతపురం వ్యవసాయ మార్కెట్ కమిటీతో పాటు కొత్తగా ఏర్పాటైన శింగనమల, రాప్తాడు కమిటీలు ఇప్పటికే వంద శాతం లక్ష్యాన్ని అధిగమించాయి. తాడిపత్రి, రాయదుర్గం లక్ష్యానికి చేరువలో ఉన్నాయి. లక్ష్యానికి ఆమడదూరంలో గుంతకల్లు, ఉరవకొండ, కళ్యాణదుర్గం, గుత్తి కమిటీలు ఉన్నాయి. ఈ నాలుగు కమిటీలు ఈ సారి వంద శాతం సాధించడం కష్టమనే వాదన వినిపిస్తోంది. అనంతపురం కమిటీ విషయానికి వస్తే రూ.3.50 కోట్లకు గానూ 103 శాతంతో రూ.3.61 కోట్లు సాధించింది. శింగనమల కమిటీలో రూ.63 లక్షలకు గానూ 109 శాతంతో రూ.68.68 లక్షలు వసూళ్లయ్యాయి. రాప్తాడు కమిటీలో రూ.44 లక్షలకు గానూ 106 శాతంతో రూ.46.64 లక్షలు సాధించింది.

అట్టడుగున గుంతకల్లు..

పన్ను వసూళ్లలో గుంతకల్లు మార్కెట్ కమిటీ అట్టడుగున స్థానంలో నిలిచింది. రూ.1.05 కోట్ల లక్ష్యానికి గాను రూ.44 లక్షలు (44 శాతం) మాత్రమే వసూలైంది. ఉరవకొండలో రూ.87 లక్షలకు గానూ 46 శాతంతో రూ.40.35 లక్షలు, రూ.66 లక్షలకు గానూ 47 శాతంతో రూ.31 లక్షలతో కళ్యాణదుర్గం, రూ.37 లక్షలకు గానూ 53 శాతంతో రూ.20 లక్షలు వసూళ్లతో గుత్తి కమిటీ చివరి నాలుగు స్థానాల్లో నిలిచాయి. రబీ పంటల పరిస్థితి ఆశాజనకంగా ఉన్నందున గుత్తి, గుంతకల్లు, ఉరవకొండ, కళ్యాణదుర్గం కమిటీల్లో ఈ నెలాఖరుకు వసూళ్ల పరిస్థితి మెరుగయ్యే అవకాశం ఉంది. దీంతో వంద శాతం లక్ష్యాన్ని చేరుకునేలా మార్కెటింగ్ శాఖ విజిలెన్స్ అధికారులు చర్యలు చేపట్టారు.

ప్రజా సంక్షేమమే జగనన్న లక్ష్యం

- తాడిపత్రి ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి



పాదయాత్రలో ఎమ్మెల్యే పెద్దారెడ్డితో పాటు పాల్గొన్న పెనుకొండ ఎమ్మెల్యే శంకరనారాయణ

పెద్దపప్పూరు: ప్రజా సంక్షేమమే లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని తాడిపత్రి ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి అన్నారు. ప్రజాసంక్షేమ పాదయాత్ర ఆరో రోజు ఆదివారం బొందలదిన్నెలో ప్రారంభమై పెద్దయక్కలూరు, కొండాపురం మీదుగా చెర్లోపల్లి గ్రామానికి చేరుకుంది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పెద్దారెడ్డికి సంఘీభావం తెలుపుతూ శ్రీసత్యసాయి జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, పెనుకొండ ఎమ్మెల్యే మాలగుండ్ల శంకరనారాయణ పాల్గొన్నారు. పెద్దయక్కలూరు, చెర్లోపల్లి గ్రామాల్లో ఏర్పాటు చేసిన బహిరంగ సభల్లో వారు మాట్లాడారు. డాక్టర్ వైఎస్సార్ హయాంలో రుణమాఫీ, ఉచిత విద్యుత్ తదితర సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి ప్రజల్లో చిరస్థాయిగా నిలిచారని గుర్తు చేశారు. ప్రస్తుత సీఎం వైఎస్ జగన్ సైతం నవరత్నాల పథకాలతో రాజకీయాలకు అతీతంగా సంక్షేమ ఫలాలను ఇంటి వద్దకే అందజేస్తున్నారన్నారు. చంద్రబాబు పాలనలో అన్ని వర్గాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారన్నారు. దోచుకో.. దాచుకో అన్న రీతిలో జన్మభూమి కమిటీలను ఏర్పాటు చేసి దోపిడీ పాలన సాగించారని మండిపడ్డారు. స్వార్థ రాజకీయాలను ప్రజలు ఛీదరించుకుంటున్నారన్నారు. 30 ఏళ్ల పాటు తాడిపత్రి నియోజకవర్గాన్ని గుప్పిట్లో ఉంచుకున్న జేసీ సోదరులు.. ఈ ప్రాంత ప్రజలకు ఏ ఒక్క మంచి పని కూడా చేయలేదన్నారు. ఎన్నికల సమయంలో తప్ప మరెన్నడూ వారు ప్రజల ముంగిటకెళ్లి సమస్యలు ఆరా తీసింది లేదన్నారు. జగన్ సర్కార్ ఏర్పాటైన తర్వాత గడపగడపకూ మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలు తిరిగి ప్రజా సమస్యలు అడిగి తెలుసుకుని, వాటి పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకున్నారని గుర్తు చేశారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలోనే ప్రజలు సుఖ సంతోషాలతో ఉన్నారని, భవిష్యత్తులోనూ వైఎస్సార్ సీపీ అభ్యర్థులను గెలిపించాలని పిలుపునిచ్చారు.

భవితకు పోలీసు సాయం





నిరుద్యోగులు ఉన్నత శిఖరాలు అధిరోహించేందుకు జిల్లా పోలీసు శాఖ సాయపడుతోంది. ఇప్పటికే సివిల్స్, గ్రూప్ పరీక్షలకు సన్నద్ధమవుతున్న అభ్యర్థుల కోసం అనంతపురం జిల్లా ఎస్పీ డాక్టర్ ఫక్కీరప్ప జిల్లా పోలీసు కార్యాలయంలో ప్రత్యేకంగా డిజిటల్ లైబ్రరీని ఏర్పాటు చేశారు. రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా నిరుద్యోగులకు బృహత్తర అవకాశాన్ని కల్పించారు. అలాగే ఇటీవల ఎస్ఐ పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న యువతకు బాసటగా నిలిచి, ఉచితంగా శిక్షణనిస్తున్నారు. ఇటీవల కానిస్టేబుల్ రాతపరీక్షల్లో అర్హత సాధించిన అభ్యర్థులు ఫిజికల్ ఫిట్‌నెస్ పరీక్షల్లో నెగ్గేలా అనంతపురంలోని పరేడ్ మైదానంలో ప్రత్యేక శిక్షణ ఇచ్చేలా చర్యలు తీసుకున్నారు. ఎస్పీ ఫక్కీరప్ప చర్యలపై సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది. - సాక్షి ఫొటోగ్రాఫర్, అనంతపురం





సబ్‌స్టేషన్ సమీపంలో అగ్ని ప్రమాదం



సబ్ స్టేషన్ సమీపంలో చెలరేగిన మంటలు

కళ్యాణదుర్గం: పట్టణంలోని విద్యుత్ సబ్‌స్టేషన్ సమీపంలో ఆదివారం అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది.ఆకతాయిలు బీడీ, సిగరెట్ తాగి పడేయడంతోనే మంటలు వ్యాపించి ఉంటాయని అధికారులు తెలిపారు. సమీపంలో ఉన్న ఫైర్ సిబ్బంది వచ్చి మంటలను అదుపు చేశారు. సకాలంలో అధికారులు అప్రమత్తం కావడంతో పెను ప్రమాదం తప్పింది.

5వ తరగతిలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

లేపాక్షి: మహాత్మా జ్యోతిభా పూలే ఏపీ గురుకుల పాఠశాలలో 5వ తరగతిలో ప్రవేశాలకు అర్హులైన విద్యార్థుల నుంచి దరఖాస్తులు స్వీకరణ ప్రకిరయ మొదలైంది. ఈ మేరకు ఆంధ్రప్రదేశ్ వెనుకబడిన తరగతుల సంక్షేమ గురుకుల విద్యాలయం జిల్లా కన్వీనర్ ప్రసాద్ ఆదివారం ఓ ప్రకటన విడుద ల చేశారు. ఐదో తరగతి ఇంగ్లిష్ మీడియంలో ప్రవేశానికి ప్రవేశ పరీక్ష ద్వారా ఎంపిక చేయనున్నారు. బీసీ, ఈబీసీ, ఇతర విద్యార్థులు 9 నుంచి 11 సంవత్సరాల వయస్సు మించి ఉండరాదన్నారు. ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు 9 నుంచి 13 సంవత్సరాల వయస్సు మించరాదన్నారు. అర్హులైన అభ్యర్థులు దరఖాస్తులు ఈనెల 6 నుంచి ఏప్రిల్ 4లోపు https//:jpapbcwreis.in ద్వారా సమర్పించాలన్నారు.

మధురం.. శరణాగతి రూపకం

ప్రశాంతి నిలయం: సత్యసాయిని కీర్తిస్తూ ఆదిలాబాద్ జిల్లాకు చెందిన సత్యసాయి భక్తులు శరణాగతి పేరుతో ఆదివారం ప్రదర్శించిన నృత్య రూపకం ఆకట్టుకుంది. పర్తి యాత్రలో భాగంగా ఆదిలాబాద్‌కు సత్యసాయి భక్తులు రెండో రోజు సత్యసాయి సన్నిధిలో పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఉదయం మహాసమాధి చెంత మహారాష్ట్ర సంస్కృతీసంప్రదాయలకు ప్రతీకగా నిలిచిన వార్కరీ భజనలతో అలరించారు. అనంతరం భక్తులకు జ్ఞాపికలను కలెక్టర్ బసంత్‌కుమార్, సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జే రత్నాకర్ అందజేసి, అభినందించారు.



భజన చేస్తున్న సత్యసాయి భక్తులు



శరణాగతి నృత్యరూపకంలోని ఓ సన్నివేశం